# విశాలాక్షి ఉంగరం

రైలు దిగి ఇంటికి వచ్చేప్పటికి— సాయంత్ర మైంది. వీధి వాకిట అరుగుమీద ప్రక్కయింటి సుభద్రమ్మగారితో మాట్లాడుతూన్న మా రాజేశ్వరి, సందుమలుపు తిరిగిన రిక్షాలో నన్ను చూసి గబుక్కున ఇంట్లోకి వెళ్ళి - రిక్షా దిగి, రిక్షావాడికి డబ్బులిచ్చి, ఇంటి వరండాలోకి వచ్చేసరికి, నాకు కాళ్ళు కడుక్కునేందుకు చెంబుతో నీళ్ళు తెచ్చియిచ్చింది. అంతవరకూ మా రాజేశ్వరి పచ్చటి ముఖంలో భర్త ఊరికి వెళ్ళి వచ్చినప్పుడు విప్పారిన సంతోషముతో - చిరునవ్వులు చిందిస్తూ అహ్వానించే ఇల్లాలి పోకడ చూశానుగాని, టర్కీటవల్‌తో కాళ్ళు తుడుచుకొని, మంచినీళ్ళు తీసుకొని రమ్మందామని ఆ ముఖంకేసి చూసేప్పటికి, సంధ్యవెలుగు తాలూకు పచ్చని కాంతిని స్ఫురణకు తేచ్చే ఆమె ముఖం నల్లమబ్బుల్ని కప్పుకొన్న కొండలాగా బరువుగా మారింది. నిజం చెప్పొద్దూ-నా హృదయం ఒక్కసారి రాతిని తాకిన నీటి అల చందమైంది. ఒక్కొక్కప్పుడు అనుకుంటాను - సంసార జీవితంలో యీ ఆడవాళ్ళు భర్తల మనస్సుల లోతుల్ని తెలిసికొనేందుకు వానాకాలపు మేఘాల్లాగా ముఖాల్ని మార్చగల నైపుణ్యాన్ని నిజంగా భగవంతుడే ప్రసాదించాడా అని. ఇల్లాలి ముఖం తీరే - దాంపత్యంతాలూకు స్థాయికి గీటురాయి కనుక, ఏదో అజ్ఞాతపు సంఘటన (?) ఆమె ముఖంలోని విపరీతమైన మార్పునకు కారణభూతమై వుంటుందని

గ్రహించినవాడనై, నన్ను నేను ఒక్కసారి చూసుకున్నాను, పసిపిల్లవాడు అల్లిబిల్లి తిరిగినట్టు.

వ్చ్ - నాలో ఏ మార్పూ నాకు గోచరించలేదు.

మా రాజేశ్వరి నాపైన తీక్షణమైన ఒక వీక్షణాన్ని విసరి - అవ్వాయి చువ్వలా రివ్వున గదిలోకి వెళ్ళింది. ఆమె నైజాన్ని నేను ఎట్లా అర్థం చేసుకోనేది ?

గడచిన రెండు సంవత్సరాల మా దాంపత్య జీవితంలో నామీద ఆమె ఇట్లా అలగడం కొత్తకాదుగానీ - ఏమిటో ఆమె తీరూ, చూపులూ, విసురూ, చూస్తోన్నకొద్దీ మా కాపురంలో ఏవో అగుపించని అంకురాలు తలలు ఎత్తాయని భయపడాల్సి వస్తూంది. నేను చేసిన తప్పు ఒక్కటే - ఉదయం కర్నూలు ఎక్స్‌ప్రెస్‌కు వస్తానన్నవాడిని సాయంత్రానికి వచ్చాను. ఈ మాత్రపు ఆలస్యానికి ఇంతకోపమా ? ఈ రెండు సంవత్సరాల్లో ఎన్నిసార్లు వస్తానన్న రోజులు తప్పించి రాలేదు? ఆ కారణం ఆమె కోపానికి సరిపడదని తేల్చుకున్నాను.

"ఏమిటి యీ ఉరుములూ, మెరుపులూ లేని గాలివాన?" అన్నాను.

ఆమె నా వంక చూడలేదు.

వెధవది నా తప్పును నేనే తెలుసుకొని ఆమెచేత క్షమాభిక్ష అడిగించుకోవాలని కామోసు ఈ పట్టుదల. నాకు కోపం వచ్చింది. స్త్రీమీద సర్వ అధికారాలనూ మగవాడికి కట్టబెట్టిన ఈ సమాజంలోని పదహారణాలా పురుషుణ్ణీ, ఇంటికి యజమానినీ, చదువుకొని విజ్ఞానాన్ని జీర్ణించుకున్నవాణ్ణీ, రెండువందల రూపాయల ఉద్యోగపు హోదాలో ఉన్నవాణ్ణీ భార్యను క్షమాభిక్ష పెట్టమని వేడుకోవడమా ? ఎంత న్యూనత? ఎంత లోకువ?

కాని ఇట్లా ఆలోచిస్తూ కూర్చుంటే సంసారం సక్రమంగా సాగుతుందా? సంసారం గుట్టుగా సాగిపోవాలంటే ఎవరో ఒకళ్ళు 'అహం' చంపుకోవాలి! ఏం చేసేది? చివరకు నేనే ఆమె కోపం వెనుక దాగివున్న అసలు రహస్యాన్ని కనుక్కోవాలని - సంఘంలో నా స్థానాన్ని తాత్కాలికంగా మర్చిపోయి భార్య క్రింద భర్తగా మారాను.

"నే నేం చేశాను రాజేశ్వరీ! ఎందు కింత కోపంగా వున్నావు? నేను చేసిన తప్పు ఏమిటి? చెప్పు, సరిదిద్దుకుంటాను," అన్నాను, గొంతులోకి బలవంతంగా మార్దవాన్ని రప్పించి.

"మీకు తెలీదా?" అన్నట్టు నా ముఖంలోకి చూసింది.

"తెలియదు," అన్నట్టు తల ఆడించి - ఆమె ముఖంలోకి చూశాను.

"మీరు ఇంతటి వాళ్ళని నే ననుకోలేదు," అన్నది గోడపై నున్న ఆఫ్‌గన్ స్నో వారి కేలండర్ కేసి చూస్తూ.

నా హృదయం గతుక్కుమంది. "ఏం?" అన్నాను నెమ్మదిగా.

"నిజం చెప్పండి. రాత్రి మీరు ఎక్కడ ఉన్నారు?" అన్నది రాజేశ్వరి సూటిగా. ఆ ప్రశ్న హృదయానికి తాకేట్టు.

ఎన్నిసార్లు రాత్రుళ్ళు ఇంటిదగ్గర లేకపోయినప్పటికీ, ఏవో బస్తీలలో రాత్రుళ్ళు గడిపినప్పటికీ యీ రెండు సంవత్సరాలలో రాజేశ్వరి నన్ను భర్తగా నాలోని పవిత్రతనూ, ప్రవర్తనలోని నీతినీ, న్యాయాన్నీ అనుమానించి ఇట్లా అడిగివుండలేదు. అయినా నేను రవ్వంత కూడా ఆ ప్రశ్నయొక్క వింతకు చలించలేదు. ఆ ప్రశ్న వేసి నా ముఖంలో జరిగే మార్పుల్ని సునిశితంగా పరీక్షించాలని రాజేశ్వరి అదేపనిగా నా వంక

చూడటంచేత, 'ఏమిటి కొత్తగా అడుగుతున్నావ్?' అని ఆమెచేత మరీ అనుమానింపబడేందుకు ఇష్టంలేక, డొంక తిరుగుడు మానేసి సూటిగానే తొణకక, బెదరక జవాబు ఇచ్చాను.

"మిత్రుడు నాగమల్లేశ్వర్రావు ఇంట్లో. విజయవాడలో ఎప్పుడు మకాం వేసినా వాడి ఇంట్లోనేగా!"

రాజేశ్వరి నవ్వింది సన్నగా. ఆ నవ్వులో నేను చెప్పిందంతా శుద్ధ అబద్ధమనే ధ్వని పలికింది.

"భార్యను మోసపుచ్చిన ఏ భర్తా బాగుపడలేదు లోకంలో."

ఉలిక్కిపడ్డాను. ఆ ధోరణీ, ఆ వైఖరీ బొత్తిగా నచ్చలేదు.

"ఏమిటి నీ ఉద్దేశం?" అన్నాను కంచుగంట ఖణేల్ మన్నట్టు.

"మీరు నన్ను మోసపుచ్చుతున్నారు."

"నేనా!"

"ఊఁ!"

"ఎట్లా!"

"నిజం చెప్పండి. రాత్రి మీరు ఎవరి ఇంట్లో మకాం వేశారు? - విశాలాక్షి ఇంట్లోకాదూ!"

"ఆఁ!"

నాముఖంలో కలిగిన ఆశ్చర్యాన్ని చూసి, అదంతా కేవలం నా నటన అనే తలంపుతో - రాజేశ్వరి నవ్వ నారంభించింది. ఏమైనా నేను రాత్రి నాగమల్లేశ్వర్రావు ఇంట్లోనే మకాం వేశాను. ఇది కాచి వడబోసిన సత్యం. విశాలాక్షి విజయవాడలో సూర్యారావుపేటలో వుంటున్న సంగతి నాకు తెలుసుకానీ -

నేను ఆమె ఇంటికి ఎందుకు వెళతాను? ఆమె రాజేశ్వరికి స్నేహితురాలు. వాళ్లు ఇద్దరూ కాలేజీలో ఇంటర్మీడియట్ వరకూ కలిసి చదువుకున్నారు. రాజేశ్వరికి నాతో వివాహం కావటం మూలాన చదువు మానేసి జీవితంలో రెండో అధ్యాయంలోనికి ప్రవేశించింది. విశాలాక్షి కూడా అట్లాగే బి. ఏ. ప్యాసైన వాణ్ని పెళ్ళి చేసుకొని మొగనితో కాపురం చేస్తోంది. ఇదివరలో రెండు మూడుసార్లు విశాలాక్షి ఇంటికి భార్యతో పాటే వెళ్ళడం జరిగింది; కానీ ఒంటరిగా ఎన్నడూ వెళ్ళలేదు, అటువంటి నాతో 'రాత్రి మీరు విశాలాక్షి ఇంట్లో మకాం వేశారు కదూ !' అని ఆమె అనటం ఏం సబబు ? నన్ను మరీ ఆశ్చర్యానికి గురిచేసిన విషయం ఏమిటంటే— రాజేశ్వరి, ఫలానా ఇంట్లో మకాం చేశారుకదూ అని ఖచ్చితంగా అడగడం! ఎట్లా కనిపెట్టిందో!

"మరీ అన్యాయంగా అడుగుతున్నావు రాజేశ్వరీ! నువ్వు లేనిది నీ స్నేహితురాలి ఇంటికి నేనుగాని ఎట్లా వెళతాను. బెజవాడ—బందరు దూరానికి గతిలేక ఆమె ఇంట్లోనే మకాం పెట్టాల్సిన అగత్యం నాకు ఏముంది? నీ అనుమానాలు మరీ..."

"మీరు నన్నెంత డొంక తిరుగుడులో ఇరికించినా నమ్మించలేరు. రాత్రి విశాలాక్షితో మీరు ఉన్నట్టు మీ వైఖరీ, ఆమెతో గడిపినట్టు నిదర్శనమూ ప్రత్యక్షంగా అగపడుతూంటే—ఇంకా నన్ను మాటలతో మభ్యపెట్టాలనే! ఏమిటండీ యీ బుద్ధులూ? చదువుకున్నవారూ, ఉద్యోగపు హోదాలో ఉన్నవారూ మీరే... కట్టుకున్న భార్యను—"

"రాజేశ్వరీ!" బిగ్గరగా అరిచాను. ఆమె అనుమానాన్ని

సహించే ఓపిక నాలో నశించింది. ఏ పాపమూ ఎరుగని నన్ను పట్టుకొని—భార్య 'ఫలానా ఆమెతో రాత్రి నువ్వు గడిపావు?' అని నిలదీయటం సహించవలసిందేనా?

"నీకేమన్నా పిచ్చి ఎత్తిందా? నేను రాత్రి నాగ మల్లేశ్వరరావు ఇంట్లో నే ఉన్నానని ఎంత చెప్పినా నమ్మ వేమిటి? రాత్రి మేము లీలామహల్ లో 'మెనీ రివర్స్ టు క్రాస్' సినిమాస్కోప్ చూసి పదిగంటలకే పడుకున్నాం. ఉదయం లేచి నేను గవర్నర్ పేట వెళ్లాను. మధ్యాహ్నం 'న్యూ ఇండియా' హోటలులో భోజనం చేశాను. మూడు గంటలకు స్టేషన్‌కు వచ్చాను. నేను అసలు విశాలాక్షి ఇంటికి ఎందుకు వెళతాను? ఆమెతో ఉన్నట్టు 'నీ వైఖరే—ఆమెతో గడిపినట్లు' నిదర్శనమా? నీకు మతేమన్నా చెడిందా?" అన్నాను కోపంగా.

రాజేశ్వరి కొంచెం జంకింది.. నావంక దృష్టి నిలిపి ఒక్క నిమిషం సేపు తీవ్రంగా చూసింది.

చివరకు అరిచేతుల్లో ముఖం కప్పుకొని కన్నీళ్ళు కార్చింది ఆమె ఎందుకు ఏడుస్తూందో బోధపడలేదు. ఆమె వంక చూస్తూ కూర్చున్నాను.

రాజేశ్వరి అన్నది: "మీ వ్రేలిన ఉన్న ఉంగరం విశాలాక్షిది కాదూ!"

అప్పటివరకూ నా వ్రేలిన ఒక ఉంగరం ఉన్నదనే విషయమే నాకు గుర్తురాలేదు. విజయవాడ స్టేషనులో రైలుఎక్కి నప్పుడు అనుకున్నాను—ఆ ఇంటికెళ్ళగానే ఆ ఉంగరం సంగతి చెబుదామని; కాని ఇంటికి రావడంతో దాని విషయం మరిచి పోయాను.

రాజేశ్వరి మనస్సు అర్థమైంది. ఆమె అనుమానానికి కూడా కారణం ఏమిటో బోధపడింది. కాని ఆ ఉంగరం విశాలాక్షిది ఎందుకైంది? మళ్ళీ రాజేశ్వరి అనుమానం నన్ను ఊపిరాడనివ్వకుండా చేసింది.

"ఆ ఉంగరం విశాలాక్షిది కాదు. రెండు మాసాల క్రితం ఆనందరావు అనే మిత్రుడు నా దగ్గరకు ఒక అపరిచిత వ్యక్తిని తీసుకొచ్చాడు—అ వ్యక్తికి అర్జంటుగా డబ్బు కావాలని. భార్యకు టైఫాయిడ్ జ్వరమట. మందుకోసం ఒక యాభై రూపాయలు కావాలట. ఊళ్ళో అప్పుగా ఇచ్చే ధర్మాత్ము డెవ్వడూ లేడట. అతను ఆనందరావుకు మిత్రుడేకానీ— ఆనందరావు అతనికి డబ్బు సహాయం చేసేపాటి స్థితి గలవాడు కాదు. అతను యీ ఉంగరాన్ని తాకట్టుగా పెట్టుకొని యాభై రూపాయలు యివ్వవలసిందని ఆనందరావు ద్వారాగా నన్ను అర్థించాడు. ఆనందరావు రికమండ్ చేశాడు. సగం ఆనందరావు సిఫార్సు వల్లనే నేను యాభై రూపాయలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాను; యాభై రూపాయలు ఇచ్చానుకూడా. ఒక్క నెలరోజులు గడువు పెట్టాను. ఆ గడువు దాటితే ఉంగరాన్ని స్వంతం చేసుకునేట్టు గానే ఉంది షరతు. నేను ఆ ఉంగరాన్ని ఆనందరావు దగ్గరే ఉంచమని చెప్పి నెల కాగానే డబ్బు వసూలు చేసి నా కివ్వమని చెప్పాను. నెల గడిచింది. నాకు ఆ సంగతే జ్ఞాపకంలేదు. రెండో నెల కూడా గడిచిపోవచ్చింది. మొన్న హఠాత్తుగా విజయవాడ స్టేషన్లో ఆనందరావు అగుపించాడు. అతని వ్రేలిన ఉంగరం ఉంది. డబ్బు ఇవ్వలేదా అన్నాను. 'పాపం వాడేమి యిస్తాడు, దరిద్రుడు. ఉంగరం నీ స్వంతం చేసుకో' అని తన వ్రేలిన ఉన్న

ఉంగరాన్ని తీసి నా వ్రేలికి తగిలించాడు. నా హృదయం జాలితో మెలికలు తిరిగినా 'యూభై రూపాయలు' అనే తలంపు రాగానే ఈ ఉంగరాన్ని కాదనలేకపోయాను. ఆ దరిద్రునిదే యీ ఉంగరం. ఈ ఉంగరం విశాలాక్షిదని అనుమానించడంలో అర్థంలేదు. లోకంలో ఎన్ని ఉంగరాలు ఒక్క విధంగా ఉండవు?"

"చెప్పండి... ఇంకా చెప్పండి. పిచ్చిదాన్ని ఏం చెప్పినా నమ్ముతాను. కథల్ని కల్పించి చెప్పడంలో లోటు ఏముంటుంది?"

నాకు తల కొట్టి పాతిపెట్టినట్లయింది. కాని వడబోసిన నిజం చెపుతూ ఆమెను ఎందుకు నమ్మించలేక పోతున్నానో నాకు అర్థం కాలేదు. స్త్రీ హృదయంలో భర్త ప్రవర్తన గురించి అనుమానానికి అంకురార్పణ జరిగితే — ఏదో ఒక సంఘటన వల్ల పశ్చాత్తాపపడి అనుమానం నిరాధారమని సిగ్గు పడాల్సిందే కాని, కేవలం పైపై మాటలు ఆ అనుమానాన్ని ఏ విధంగానూ తొలగించలేవనే సత్యం నా మనస్సులో మెదిలింది.

"ఆ ఉంగరం ముమ్మాటికీ విశాలాక్షిదే. నాకు బాగా గుర్తు. ఎరుపూ తెలుపూ రాయి ప్రక్కన ఆ నగిషీ పనితనాన్ని నేను సెలెక్టు చేసిందే. నాకళ్ళకే గంతలు కట్టాలని మీరు చూస్తున్నారు..." అన్నది రాజేశ్వరి; నా ఆర్గ్యుమెంట్సును ఒప్పుకోవడం తనకు సాధ్యం కాదని స్పష్టంగా చెబుతూ.

నేను ఇంకా ఎట్లా ఒప్పించేది? నేను విశాలాక్షి ఉంగరాన్ని ఎన్నడూ చూడలేదు. చూసిఉండినా రాజేశ్వరిని ఒప్పించడం నాకు సాధ్యమా? పట్టుదలకూ, పెంకితనానికీ, అలక్ష్యానికీ, అంతకూ — మా రాజేశ్వరి పెట్టింది పేరు, ఆమెలో ఆయా గుణాలు ఉద్భవించి ఉధృతంగా పెరిగినప్పుడు

ఓర్పును పెంచుకోవడం మినహా నేను చేయగలిగింది ఏమీ లేదు. కొన్ని కొన్ని సమయాలలో గాడిదనే గుర్రాన్నిగా ఎంచుకొనవలసిన దుస్థితి సంభవిస్తుంది. ఆ విధంగానే రాజేశ్వరి మాటలలోని కలతీలేని సత్యాన్ని విశ్వసించకపోయినా ఆధార రహితమైన అభాండాన్ని నామీద రుద్దినా తాత్కాలికంగా సహించి మెదలకుండా ఊరుకున్నాను. వూరుకుంటే ఎట్లా ?

ఆ రాత్రి మా ఇద్దరి పరిస్థితీ ఉత్తర ధృవమూ, దక్షిణ ధృవమూ ! నాచేత నిజాన్ని కక్కించలేకపోయాననే అవమానమూ, భర్త పెడదారులు పట్టి ఇల్లాలి మాంగల్యానికి అప్రదిష్ట తెస్తున్నాడనే బాధా, స్నేహితురాలి భర్తను వలలో వేసుకొని ఉంగరాన్ని బహూకరించి ద్రోహాన్ని తలపెట్టినందుకు విశాలాక్షిమీద అక్కసూ రాజేశ్వరిలోనూ — వెదవధి ఎంత నిజం చెప్పికూడ ఆమెను నమ్మించలేక పోయానన్న కించా, పవిత్రంగా బ్రతుకుతూకూడా భార్యచేత శంకించబడి అపవిత్రుణ్ణి కావలసిన దుస్థితి పట్టినందుకు బాధా, ఆ ఉంగరాన్ని తాకట్టు పెట్టించి డబ్బు లాగలేక ఉంగరాన్నే స్వంతంచేసుకోమని ఇచ్చిన ఆనందరావుమీద కోపమూ—నాలోనూ పెచ్చు పెరిగి, ఆరాత్రి మా ఇద్దరి దాంపత్యములోనూ చెడ్డకాలాన్ని సృష్టించింది.

ఆ రాత్రంతా ఆలోచించి నేను ఒక నిర్ణయానికి వచ్చాను. ఆ ఉంగరం విశాలాక్షిదే నన్న మా ఆవిడ వాదనలో నాకు వీసం ఎత్తు విశ్వాసం కూడా కుదరనిమాట వాస్తవమే అయినప్పటికీ — మా ఆవిడకు బుద్ధి వచ్చేట్టు, భర్తమీద యిట్లాంటి అనుమానాలకు ఎన్నడూ తావు కల్పించకుండా చేసేటట్టు, తన చెంపల్ని తానే వాయించుకునేట్టు చేయాలనే ఊహ నాలో మెరిసి తెల్లవారు ఝామున అందుకు తగిన

పథకాన్ని జాగ్రతగా ఆలోచించాను.

*　　*　　*　　*

ఉదయం తొమ్మిదిన్నరకు భోజనం చేసి, డ్రస్సు వేసు న్నాను. 'మామూలుగానే కాలేజీకి వెళుతున్నారు ' అనుకుంది రాజేశ్వరి. కాని నేను కాలేజీకి వెళ్ళలేదు. సెలవు వ్రాసి ఒక విద్యార్థిచేత కాలేజీకి పంపించాను. విజయవాడ వెళ్లే బస్సులో ఎక్కి కూర్చున్నాను. విశాలాక్షిని సాయంత్రం లోపుగా తీసుకొని వచ్చి రాజేశ్వరి ముందు నిలబెట్టి — ఆమె వ్రేలిన వున్న వుంగరానికీ, నా వ్రేలిన వున్న వుంగరానికి వున్న భేదాన్ని చూడమని అంటే కానీ, రాజేశ్వరి హృదయంలో పాతుక పోయిన అనుమానం పటాపంచలై, తన తెలివితక్కువతనానికి తలను క్రిందకు దించదు. అందుచేత కాలేజీకి శెలవు పెట్టి, రాజేశ్వరికి తెలియనివ్వకుండా బెజవాడకు బయలుదేరాను.

"ఎక్కడకు వెళ్లుతున్నారండీ ?" అని ఆమె అడుగుతుం దనుకున్నాను. కాని అడగవేదు. అడిగేందుకు అవకాశం మటుకు ఏది ? మామూలుగా కాలేజీకి వెళ్లే డ్రస్సే ఆ రోజు కూడా ధరించానాయె ! బస్సులో బెజవాడ జేరేవరకూ నా మనస్సు ఆలోచనల పరిధిలో అల్లాడుతూనే వుంది. నన్ను అనవసరంగా అనుమానించి, నాపై కోపం వహించిన రాజేశ్వరి హృదయం పశ్చాత్తాపంతో గజగజ లాడేటట్లు చేసేవరకూ నా మనస్సు అట్లా అల్లకల్లోలంగానే వుంటుంది.

గవర్నరుపేటలో బస్సు దిగి రిక్షాలో విశాలాక్షి యింటికి వెళ్లాను. విశాలాక్షి బయట వరండాలో పేంకుర్చీలో కూర్చుని చదువుకుంటోంది.

అప్పుడే అభ్యంగన స్నానం చేసినట్లు వుంది. పర్వత

దశలో ప్రవహించే నది వంపుల్ని స్ఫురణకు తెచ్చాయి ఆమె తల వెంట్రుకలు. పల్చటి మేఘం వెనుక దాక్కున్న చంద్రుని కాంతి వంటి రంగు ఆమెది. ఆమెను చూస్తూన్నకొద్దీ నా మనస్సు — పింఛం విప్పుకొన్న నెమలినీ, రెండు కొండల మధ్య సరస్సులోని చందమామనూ, సాయంకాలపు ఇంద్ర ధనస్సునూ చూస్తున్నప్పటి అవ్యక్తమైన ఆనందముతో ఊగిస లాడ నారంభించింది. నా రాకను ఆమె గమనించలేదు.

గమనించాక దిగ్గున కుర్చీలోంచి లేచింది. అంతలోనే అతిథిని అహ్వానిస్తోన్నప్పటి ఉత్సాహం, ఆప్యాయాతా ముఖంలో చిరునవ్వు రూపంలో ప్రదర్శించింది. "కూర్చోండి!" కుర్చీ చూపించింది.

ఇంట్లోకి వెళ్ళి చెంబుతో నీళ్లు తెచ్చి యిచ్చింది కాళ్ళు కడుక్కునేందుకు. నేను ఆ మర్యాదను స్వీకరించాక, వెండి గ్లాసుతో మంచినీళ్ళు తెచ్చి యిచ్చింది. అప్పుడు ఆమె చేతి వ్రేళ్ళకేసి దీక్షగా చూశాను. ఉంగరం లేదు. ఏమైంది? నా గుండెల్లోకి క్రమంగా నీరు ప్రాకింది. మళ్లీ నేను కాళీ గ్లాసును అందించేటప్పుడు నా వ్రేలిన వున్న వుంగరాన్ని ఆమె చూసి నట్టు వుంది. కనుబొమ్మల్ని ఆశ్చర్యంగా ఎగురవేసింది.

నన్ను కూడా ఆశ్చర్యం ఆవరించింది.

"రాజేశ్వరి బావున్నదండీ!" అన్నది విశాలాక్షి. కాని ఆమె చూపులూ, మనస్సూ నా వ్రేలిమీదే ఉన్నాయి. ఈ ఉంగరం విశాలాక్షిదే ఐ ఉంటుందని అనుకునేందుకు ఏ అడ్డంకూ నాకు అగుపించలేదు, అయితే ఆమె వుంగరం ఆనందరావు మిత్రునిదగ్గరకు ఎట్లా వెళ్ళింది?

"బాగానే వుంది; మీవారు ఇంట్లో లేనట్లువుంది."

"ఆఫీసు కెళ్లారు."

మా యిద్దరి మధ్యా సంభాషణ క్షణం తెగిపోయింది. కాని విశాలాక్షి ఏదో అమూల్యమైన వస్తువు పారవేసుకుని, జీవితంలో దొరకదని నిర్ణయించుకుని, నిరాశ చెందాక అప్రయత్నంగా దొరికినప్పుడు ఆతురతతో చూడటం నాకు అదోరకమైన జంకును కలిగిస్తోంది. కాని నేను ఏ పనిని నెరవేర్చుకునేందుకు వచ్చానో దానికి అదిలోనే విఘ్నం ఎదురైనట్లు 'ఫీల్' కాసాగాను

చివరకు విశాలాక్షి సాహసంచేసి, నన్ను అడిగింది. "ఆ వుంగరం ఎప్పుడు చేయించుకున్నారండీ!"

కొద్ది క్షణాలు తటపటాయించాను — నిజం చెప్పటమా? అబద్ధంచెప్పడమా? అని.

అబద్ధం చెప్పడం శ్రేయస్కరంగా తోచలేదు.

"చేయించుకోలేదు —"

"షాపులో కొన్నారా?"

"కొనలేదు —"

"మరి?"

"ఏం! అంత యిదిగా అడుగుతున్నారు?" అన్నాను, ఆమెనుంచి అసలురహస్యాన్ని సేకరించాలని.

మొదట్లో విశాలాక్షి కొంచెం తడబడింది.

"ఏం లేదండీ! రెండు మాసాల క్రితం మావారు నా వుంగరం తీసుకున్నారు. రెండు రోజులు గడిచాక వారి వ్రేలిన నా వుంగరం లేకపోవడం గమనించి భయపడి అడగ్గా — ఎక్కడో జారిపోయిందని సంజాయిషీ చెప్పుకున్నారు. మీ వ్రేలిన ఉన్న వుంగరంలాంటిదే! ఆ రాయీ, ఆ చెక్కుడూ అంతా ఇట్లావే

వుంటుంది. అసలు నా అనుమానం..."విశాలాక్షి సందేహించింది.

"ఊ! చెప్పండి" అన్నాను.

"మీరు నొచ్చుకోకపోతే నా మనస్సులో మెదలుతున్న విషయాన్ని చెబుతాను".

"నొచ్చుకోను లెండి!"

"ఈ ఉంగరం తప్పకుండా నాదేనండీ!" అన్నది విశాలాక్షి.

నేను ఆలోచనలో పడ్డాను. మా రాజేశ్వరి అనుమానపడటానికీ, విశాలాక్షి ఆర్గ్యుమెంటుకూ చాలా దగ్గరసంబంధం వుంది. ఈ ఉంగరం విశాలాక్షిదే ఐవుంటుంది. ఆ దరిద్రునికి ఈ ఉంగరం దొరకివుంటుంది ఏ వీధిలోనో. డబ్బులేక నాకిది తాకట్టు పెట్టివుంటాడు. దొరికిన వస్తువే కనుక వచ్చిన డబ్బు చాలుననుకుని తృప్తిపడి వుంటాడు. అందువల్లనే డబ్బు చెల్లించి వుంగరం పట్టుకెళ్లలేదు.

మీ దగ్గర కెట్లా వచ్చిందా వుంగరం?" అన్నది విశాలాక్షి.

ఆ వుంగరం నాకు లభించిన విధానాన్ని వివరంగా చెప్పాను.

"ఈ ఉగరం మీదేనని మా రాజేశ్వరి వాదించింది. ఆ వాదన ఎంతవరకు నిజమోనని మీ దగ్గరకు వచ్చాను." మా రాజేశ్వరి నామీద పెట్టుకున్న బెంగనూ, అనుమానాన్నీ చెప్పలేదు. నా భార్యగా ఆమెకు ఉచితమైన విలువను ఇచ్చి గౌరవాన్ని కాపాడదల్చుకున్నాను; అది నా ధర్మం కాదూ!

"ఈ ఉంగరం నాదేనండీ. అతనికి ఏ వీధిలోనో దొరికి వుంటుంది," అన్నది విశాలాక్షి.

నా వ్రేలిన వున్న వుంగరం తీసి విశాలాక్షికి ఇచ్చాను. ఆ వుంగరాన్ని ఆమె చాల ఆప్యాయతగా చూసుకుంది. వ్రేలికి తగిలించుకుంది. ఆమె నడిమి వ్రేలికి బాగా సరిపోయింది. ఆమెదే

ఆ వుంగరం అని మరోసారి మనస్సులో నిశ్చయంగా అనుకున్నాను.

నాకు, వచ్చిన పని అయిపోయినట్టుగా తోచింది. బయలుదేరబోయాను. కాని విశాలాక్షి మధ్యాహ్నం ఫలహారం తిన్నతరువాత కాఫీ యిచ్చాక వెళ్లేందుకు అనుమతి యిచ్చింది. నేను వెంటనే బస్సుఎక్కి కాలేజీ వదిలేవేళకు బందరు వచ్చాను.

నేను విజయవాడ వెళ్లివచ్చినట్లు రాజేశ్వరితో చెప్ప లేదు. నా పట్ల ఆమె కోపం తగ్గనుకూడా లేదు. ఆమె యిట్లా ఎన్నాళ్లు నా మీద లేనిపోని అనుమానాన్ని పెంచుకుని, భాధ పడుతూ, వ్యతిరిక్తంగా వుంటుందో పరీక్షించా అనుకున్నాను.

మూడోరోజు సాయంకాలం కాబోలు నేను కాలేజీనుంచి యింటికి వచ్చేటప్పటికి — వీధివాకిట్లో మా రాజేశ్వరి నా రాకకోసం చకోరపక్షిలా నిరీక్షిస్తున్నట్టు నిలబడివుంది. అయిదు రోజులకు గాను ప్రథమంగా ఆమె ముఖంలో తేటదనాన్ని మళ్ళీ చూచాను. ఏదో జరిగివుంటుందని తేలిగ్గా వూహించాను.

నేను యింట్లోకి రావటంతోనే —

"నన్ను క్షమించండీ!" అన్నది. ఆమె ముఖంలో వెల్లివిరిసిన కాంతికి నా హృదయం కరిగిపోయింది. ఆమె ముఖంలోనికి చూశాను 'క్షమించాను' అన్నట్టు. కాని నిజానికి వస్తే నాకేం తెలుసు — ఆమె ఎందుకు క్షమించమన్నదో, నేను ఎందుకు క్షమిస్తానన్నానో.

"విశాలాక్షి ఉత్తరం రాసింది. మిమ్మల్ని అనవసరంగా అనుమానించి- కలవరపెట్టి, మీకు కష్టం కలిగించాను. క్షమించండి," అన్నది రాజేశ్వరి.

సగర్వంగా ఆమె కళ్లల్లో లోతులకు చూశాను. భార్య

'క్షమార్పణ' కోరాక - భర్త కోపాన్ని దిగమింగుకోక ఇంకేం చేస్తాడు? మా రాజేశ్వరి హృదయంలో అంకురార్పణ జరిగి అంతలోనే వూడలు దించుకుని మహా వృక్షంలాగ పెరిగిపోయిన అనుమానవృక్షం మొదలంటా పెరికివేయబడిందని తెలుసుకొని సంతోషపడ్డాను.

*  *  *  *

ఒకసారి విజయవాడ స్టేషన్లో హఠాత్తుగా ఆనందరావు అగుపించాడు. ట్రైన్ ఎక్కేందుకు సిద్ధంగా వున్నవాణ్ణి కిందకు దించాను - విశాలాక్షి వుంగరం అతని స్నేహితునికి లభించిన విధానాన్ని సమగ్రంగా తెలుసుకుందామని.

"ఏం బ్రదర్! కనబడి చాలారోజులైందే!" అన్నాను.

"అవును. తీరికలేదు."

సరేకాని - నిజంగా ఆ వుంగరం నీ స్నేహితునిదేనా ?" అన్నాను అతని ముఖంలోకి చూస్తూ.

కొంచెం చలించాడు. చలించినవాడు ఏమన్నా అనుకుంటాననే ఉద్దేశ్యంతో సర్దుకుసేందుకు చేసిన ప్రయత్నంకూడా విఫలమయ్యేట్టు అతని ముఖంవంకే చూశాను. చివరకు నిజం చెప్పేందుకే సంసిద్ధుడై వున్నట్టు ముఖంపెట్టి అన్నాడు:

"ఏం జరిగిందేమిటి ?"

" వుంగరం నీమిత్రునికి ఎక్కడ దొరికింది ? " అన్నాను.

"దొరకటమా ?" నవ్వాడు ఆనందరావు.

ఆ నవ్వు వెనుక నున్న వ్యంగ్యం నాకు అంతుపట్టలేదు.

" నవ్వుతా వెందుకూ! నిజమేదో త్వరగా యేడువు, " అన్నాను విసుగ్గా.

"ఆ వుంగరం వెనుక చిన్న గాథ వుందిలే. నా మిత్రుడు

విజయవాడ సూర్యారావు పేటలో వుంటున్నాడు. అతని యింటి ప్రక్క యిల్లాలికి అతనిమీద బాగా మనస్సుపడ్డది. ఆ విషయం అతను గ్రహించాడు. తనకు మనస్సు వున్నట్టే నటించాడు. తమ ప్రేమకు చిహ్నంగా ఒకవస్తువును కోరాడు. ఆమె తన వుంగరాన్ని అతని కిచ్చింది—"

ఇంతలో స్టేషన్లో గంటకొట్టారు.

"వస్తాను బ్రదర్!" అంటూ రైలెక్కాడు ఆనందరావు.

నాకు తల తిరిగి, కళ్లు భైర్లుక్రమ్మి ప్లాటుఫారం మీద కూలిపడినంత పనైంది.

ఆమె విశాలాక్షేనా? విశాలాక్షే ప్రియునికి ఆ వుంగరాన్ని ప్రేమకు చిహ్నంగా యిచ్చిందన్నమాట. ఆ వుంగరాన్ని తను జాగ్రతగా...ఎంత వంచన?... ఇంతకూ ఆమె విశాలాక్షేనా? గబుక్కున ఆనందరావు ఎక్కిన పెట్టె దగ్గరకు వెళ్లాను.

"ఆనంద్! ఆమే పేరేమిటి?"

"పేరా? పేరు... సరిగ్గా గుర్తులేదు. ఆమె భర్తకు రిజిస్ట్రారాఫీసులో ఉద్యోగం."

రైలు కదిలింది.

అపును; విశాలాక్షి భర్తకు రిజిస్ట్రారాఫీసులోనే ఉద్యోగం.

*

(ఆంధ్ర ప్రభ)